క్లుప్తంగా

నేడు వెల్లటూరులో గీతా జయంతి

భట్టిప్రోలు: కార్తిక బహుళ అమావాస్య పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం వెల్లటూరు గీతా జ్ఞానాశ్రమంలో ఆదివారం గీతా జయంతి నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు వేములపల్లి వనజాక్షి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గీతా ప్రచార మండలి గురూజీ శ్రీశైలార్యదేశిక స్వామి ఆశీస్సులతో ఆస్థాన పండితులు, యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతిచే కర్పూరంతో గీతా జ్ఞాన కర్పూర యజ్ఞం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే కార్తిక వన సమారాధన జరుగుతుందని పేర్కొన్నారు.

బాల్య వివాహాలు సాంఘిక దురాచారం



వేమూరు: బాల్యవివాహాల నిరోధానికి అందరూ కృషి చేయాలని అమర్తలూరు ప్రాజెక్ట్ సీడీపీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయం వద్ద బాల్య వివాహాలకు వ్యతిరేకంగా శనివారం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సాంఘిక దురాచారమని, బాలికలను వారి కలలను సాకారం చేసుకునే అవకాశాలను దూరంగా చేస్తోందని ఆమె తెలిపారు. ఎంపీడీఓ శివన్నారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శాంతి శ్రీ, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సూరేపల్లిలో లక్ష దీపోత్సవం



సూరేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో కొలువైన శ్రీకేదారేశ్వర వాయులింగం దేవస్థానం ప్రాంగణంలో శనివారం రాత్రి లక్ష దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాధారులు, భవానీ,శివ స్వాములు పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షల శిబిరం



బాపట్ల: కళాశాల పూర్వ విద్యార్థులు తాము విద్యనభ్యసించిన కళాశాల పట్ల గౌరవాభిమానాలు కలిగివుండటమే కాక ప్రస్తుత విద్యార్థులపట్ల బాధ్యత వహించి సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి అన్నారు. 1974 బ్యాచ్ వ్యవసాయ విద్యార్థుల సౌజన్యంతో వ్యవసాయ కళాశాలలో నిర్వహించబడిన ఉచిత కంటి పరీక్ష శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పెదకాకాని శంకర్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బందిచే కళాశాల విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి కంటి పరీక్షలు ఉచితంగా చేశారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ అబోలి పాల్గొని మాట్లాడారు. 700 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఆసుపత్రి మేనేజర్ ఎల్.శ్రీనివాసరావు, ముగ్గురు టెక్నీషియన్లు, 11 మంది పారా మెడికల్ సిబ్బంది ఎన్.ఎస్.ఎస్. అధికారులు పాల్గొన్నారు.

అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన

ముగిసిన విక్రయాలు



తెనాలిఅర్బన్: స్వయం సహాయక సంఘాల సభ్యులు నిర్వహిస్తున్న అర్బన్ మార్కెట్‌కు విశేష స్పందన లభించింది. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్‌ను పట్టణ వాసులు శనివారం పరిశీలించి పలు వస్తువులు కొనుగోలు చేశారు. ఈసందర్భంగా మెప్మా సీఎంఎం విజయ కుమారి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్ కల్పించాలనే ఉద్దేశంతో నెలలో రెండు రోజులు మున్సిపల్ మార్కెట్ వద్ద అర్బన్ మార్కెట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈనెలలో శుక్ర, శనివారాలలో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో పలువురు ఆర్పీలు, స్వయం సహాయ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు



రేపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

రేపల్లె రూరల్: ఎయిడ్స్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో వైద్యశాల సిబ్బంది, రోగులకు ఎయిడ్స్, చట్టాలపై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వైద్యులు సహనంతో కూడిన వైద్యసేవలు అందించాలని, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. ఈ వ్యాధిబారిన పడినవారు మనోనిగ్రహంతో, మానసిక ధైర్యంతో ఉండేలా కౌన్సెలింగ్ ఇవ్వటంతో పాటు వ్యాధి శక్తి నిరోధక శక్తి పెంపొందించుకునే మార్గాలను వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిని మాత్రమే ద్వేషించాలని, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులనుకాదని చెప్పారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని గుర్తు చేశారు. ఈ వ్యాధిగ్రస్తులను ఎవరైనా దూషించినా, ద్వేషించినా చట్టపరమైన చర్యలు ఎదుర్కొనక తప్పదన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై ప్రజల్లో, ముఖ్యంగా యువతలో చైతన్యం తీసుకువచ్చి వ్యాధిబారిన పడకుండా వైద్యులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వాధిపై, చట్టాలపై అవగాహన కల్పించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.రూపశ్రీ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీ గోపారావు, డాక్టర్లు జీన్, చైతన్య, పృథ్వీ గణేష్, ఎయిడ్స్ కౌన్సిలర్ రాజేంద్ర, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

రేపల్లె రూరల్: అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా శనివారం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ టీసీ రవిచంద్రకుమార్ ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు చేతభూని ఎయిడ్స్ వ్యాధిని నివారిద్దామంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. రెడ్ రిబ్బన్ క్లబ్ కో–ఆర్డినేటర్ బుజ్జిబాబు, అధ్యాపకులు బి.కోటేశ్వరరావు, ఎం.దాసు, కె.బాల గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

అమర్తలూరు(వేమూరు): రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. అమర్తలూరు మండలం పెదపూడి, చుండూరు గ్రామాల్లో శనివారం ఆయన పింఛన్ల పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలంలో శనివారం పింఛన్ల పంపిణీ జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరుసగా 5వ నెల కూడా సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, అధికారుల చేత పింఛన్లు పంపిణీ చేయించారు. 93.72 శాతం పంపిణీ చేశారు. అలాగే గ్రామాల్లో ఒక చోటకు పిలిపించి పింఛన్‌దారులకు పంపిణీ చేయడం జరిగింది. ఇంటింటికి తిరిగి ఇవ్వకుండా ఇదేమిటని పలువురు లబ్ధిదారులు ప్రశ్నించారు.

కర్లపాలెం: అధికారులందరూ అంకితభావంతో పింఛన్లు పంపిణీ చేస్తున్నారని డీపీఓ కేఎల్ ప్రభాకర్‌రావు తెలిపారు. కర్లపాలెం మండలంలోని యాజలి గ్రామంలో శనివారం జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డీపీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో 95శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు.



పెదపూడిలో పింఛను పంపిణీ చేస్తున్న వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లెరూరల్: ఆర్థిక ఇబ్బందులతో అల్లాడిపోతున్న ప్రజలపై విద్యుత్ డిస్కంల సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ భారాలని రద్దుచేయాలిని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ డిమాండ్ చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని పట్టణంలోని బస్టాండ్ సెంటరులో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వంపై సాకు చూపుతు ట్రూ అప్ చార్జీల పేరుతో గత నెలలో రూ.7000కోట్లపైన భారం మోపిందన్నారు. నేడు డిస్కంల ప్రతిపాదన పేరుతో విద్యుత్ ఛార్జీలను విద్యుత్ నియంత్రణ మండలి బోర్డు ఎటువంటి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా రూ.9వేల కోట్లను 2024 డిసెంబర్ నుంచి 2026 నవంబర్ వరకు యూనిట్‌కి 92 పైసలు చొప్పున ప్రజల నుంచి వసూలు చేసుకోవడానికి అనుమతించటం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుతు భారాలను వెనక్కి తీసుకోవాలన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలు, నిరుద్యోగులు, చేతి వృత్తిదారులకు అమలు చేస్తానన్న హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం తాత్సారం చేస్తోందని, మరోపక్క నిత్యవసర వస్తువుల ధరలు ప్రతిరోజూ పెరుగుతున్నా వాటిని నియంత్రించకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల భారం తగ్గించకపోతే చారిత్రాత్మకమైన మరో విద్యుత్ పోరాటం తప్పదని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ ఛార్జీల పెంపుదల ఉత్తర్వుల కాగితాలను దహనం చేశారు. సీపీఎం నాయకులు కె.ఆశీర్వాదం, కె.రమేష్, జె.ధర్మరాజు, ఆగస్టిన్, ప్రజా సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



పెంచిన విద్యుత్ భారాల ఉత్తర్వు కాగితాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పేదలందరికీ నివేశన స్థలాలు ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.బి.శ్రీధర్

బాపట్లటౌన్: నిరుపేదలైన ప్రతి ఒక్కరికీ నివేశన స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జె.బి.శ్రీధర్ తెలిపారు. పట్టణంలోని 3వ వార్డు, రాజీవ్‌గాంధీ కాలనీలోని నివేశన స్థలాలు లేని నిరుపేదల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జె.బి.శ్రీధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు, గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మూడు సెంట్లు, పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు చొప్పున ఇంటినివేశన స్థలాలు ఇచ్చి, పక్కా గృహాల నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలన్నారు. నిరుపేదల నివాసగృహాల చుట్టూ నిలుస్తున్న వర్షం నీటిని వెంటనే తొలగించి పేదలు నివాసం ఉండే ప్రాంతాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం తక్షణమే కల్పించాలన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మామిడి బత్తుల అశోక్, మహిళ సమైక్య జిల్లా కన్వీనర్ రత్నకుమారి, సీపీఐ నాయకుడు ఆట్ల పోలిరెడ్డి పాల్గొన్నారు.



పేదలనుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న జేబీ శ్రీధర్

నేటి నుంచి పాక్షికంగా తాగునీటి సరఫరా

రేపల్లెరూరల్: సాంకేతిక కారణాలు తలెత్తటంతో పట్టణంలో వారం రోజుల పాటు పూర్తిస్థాయిలో కాకుండా పాక్షికంగా తాగునీటిని సరఫరా చేయటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ వద్ద రా వాటర్ పంప్‌లు, క్లియర్ వాటర్‌పంప్ హౌస్ వద్ద మోటార్లు మరమ్మతులకు గురవ్వటంతో వాటి స్థానంలో కొత్తవి అమర్చే ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ ప్రక్రియ నేపథ్యంలో వారం రోజుల పాటు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, కొద్దిపాటి నీరు మాత్రమే సరఫరా అవుతుందని, పట్టణ ప్రజలు నీటిని వృథా చేయకుండా సహకరించాలని కోరారు.

నేడు వెల్లటూరులో సన్నాహక సమావేశం

భట్టిప్రోలు: జనవరి 5వ తేదీన విజయవాడలో జరగనున్న హైందవ శంఖారావం సన్నాహక సమావేశం ఆదివారం సాయంత్రం 4 గంటలకు భట్టిప్రోలు మండలం వెల్లటూరు శ్రీకట్లమ్మ తల్లి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు.

బాపట్లలో చోరీ

రూ. 1.20 లక్షలు అపహరణ

బాపట్లటౌన్: బాపట్లలోని ఓ నివాసం గృహంలో చోరీ జరిగింది. పట్టణంలోని సంజయ్‌గాంధీ కా లనీలో నివాసం ఉంటున్న ఓ కళాశాల ప్రిన్సిపాల్ గృహంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడి రూ. 1.20 లక్షలు నగదును అపహరించారు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

ఆకట్టుకున్న బృందగానం



తెనాలి: పట్టణ నెహ్రూరోడ్డులోని శ్రీరుక్మిణీ సమేత గోవర్ధనస్వామి/ శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం శ్రీహరి నామ సంకీర్తన బృందంచే సంకీర్తన గానం జరిగింది. గురువు పెరవలి వంశీకృష్ణ ,అందె బాల చంద్రమౌళి, అందె రాజేశ్వరి, తన్మయి, మాదల నాగఅర్చన, రూపశ్రీ, కొత్తమాసు పుష్పలత, దంటు శర్వాణి, పువ్వాడ విష్ణుప్రియ, శ్రీపూజిత, వేమవరపు లక్ష్మి నరసింహారావు, టీవీఎస్ శాస్త్రి సంకీర్తనలలో పాల్గొన్నారు. శ్రీఆంజనేయస్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణ నేతృత్వంలో ఈ కార్యక్రమం చేశారు. ప్రతి శనివారం హిందూ ధర్మ ప్రచార పరిషత్, తిరుమల తిరుపతి దేవస్థానములు సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి శనివారం గోవర్ధనస్వామి దేవాలయంలో వారం భజన ఉంటుందనీ, డిసెంబర్ నెలలో తిరుమలలో ఇదే బృందంచే భక్తిరంజని ఉంటుందని పెరవలి వంశీకృష్ణ తెలియజేశారు.

సమగ్రాభివృద్ధికి సహకరించండి

కౌన్సిల్ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ కట్టా మంగ

రేపల్లె రూరల్: పట్టణ సమగ్రాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ కోరారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పట్టణంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. పుర ప్రజలు తమ గృహంలో వచ్చే చెత్తను నిర్ణీత ప్రదేశాలలో పడవేయటంగాని, పారిశుద్ధ్య సిబ్బందికి అందించటంగానీ చేయాలన్నారు. నీటి వృథాను అరికట్టాలన్నారు. కౌన్సిలర్‌లు తమ వార్డులలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం అజెండాలోని 24 అంశాలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్లు గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్, తునుగుంట్ల కాశీ విశ్వనాథ గుప్తా, కమిషనర్ కాకర్ల సాంబశివ రావు, కౌన్సిలర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ

సాహిత్యపు సంకెళ్లను తెంచిన ధీశాలి శ్రీశ్రీ

నెలనెలా నందివర్ధనం కార్యక్రమంలో డాక్టర్ సుంకర గోపాల్

బాపట్ల: దేవుడి స్థానంలో మానవున్ని, మతం స్థానంలో జ్ఞానాన్ని, మనిషికి మనిషి ప్రేమను పంచే తత్వాన్ని గురజాడ అప్పారావు తీసుకొచ్చి, అప్పటి సమాజంలో విప్లవాత్మక మార్పులను తన సాహిత్యంతో ప్రతిపాదించి మహాకవిగా చరిత్రలో నిలిచారని డాక్టర్ సుంకర గోపాల్ తెలిపారు. వివేక సర్వీస్ సొసైటీ, ధృతి సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో వెదుళ్లపల్లిలోని వివేక సర్వీస్ సొసైటీ ప్రాంగణంలో శనివారం సాయంత్రం నెలనెలా నందివర్ధనం 94వ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టరు సుంకర గోపాల్ మాట్లాడుతూ సమాజంలో గత శతాబ్దకాలంగా పరిఢవిల్లిన వచన కవిత్వం అంతటికీ ఆధారభూతమైన భావజాలాన్ని గురజాడ అందించారనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఇదే తీరులో ఎంతోమంది వచన సాహిత్యాన్ని సుసంపన్నం చేసినప్పటికీ, శ్రీశ్రీ మరో మైలురాయిగా నిలిచి మహాకవిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారని తెలిపారు. అనేక అపోహలని అనుమానాల్ని సంశయాలని పటాపంచలు చేస్తూ సూటిగా, నేరుగా, పదునుగా తన కవిత్వాన్ని అందించిన శ్రీశ్రీ తెలుగు జాతిని ఉద్రూతలూగించారని వివరించారు. మరోవైపు దిగంబర కవులు తమ వచన కవిత్వంతో సమాజాన్ని ప్రశ్నించడంలో సఫలీకృతులయ్యారని, ఆ భూమికతోనే విప్లవ సాహిత్యం వెల్లివిరిసిందని తెలిపారు. తెలుగు సాహిత్యం ఉన్నంత కాలం గురజాడ, శ్రీశ్రీ మహాకవులు గానే కీర్తించబడతారని స్పష్టం చేశారు. వివేకా సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు ఎన్‌వీవీ నాగరాజు, కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యం , సమన్వయకర్త శీలం శ్రీనివాసరావు, బాపట్ల, చీరాల, పొన్నూరు గుంటూరు తదితర ప్రాంతాల నుంచి సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సుంకర గోపాల్

ఘనంగా కార్తిక వన సమారాధనలు

రేపల్లె రూరల్: మండలంలోని అరవపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో పలు కాపు ఉప సంఘాల ఆధ్వర్యంలో శనివారం కాపు కార్తిక వనసమారాధన ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి కాపు సంఘీయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కాపు సంఘ నాయకులు మాట్లాడారు. వివిధ రంగాలలో రాణిస్తున్న సంఘీయులను సత్కరించారు. నాయకులు కమతం సాంబశివరావు, ఉగ్గిరాల సీతారామాంజనేయులు, గాదె వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రాజు, మొవ్వా వృషాద్రిపతి, గడ్డం రాధాకృష్ణమూర్తి, దేవగిరి సాంబశివరావు, మల్లెల రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో నియోజకవర్గ గౌడ కార్తిక వన సమారాధన ఘనంగా జరిగింది. పలువురు గౌడ సంఘీయులు పాల్గొని, మాట్లాడారు.



వన సమారాధనలో పాల్గొన్న కాపు సంఘ నాయకులు

రాజ్యాంగం మెజార్టీ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలి

రాజ్యాంగంపై చర్చాగోష్టిలో 'విరసం' సీఎస్ఆర్‌కే ప్రసాద్

తెనాలి: భారత రాజ్యాంగం దేశంలోని మెజారిటీ ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చినపుడే అందరూ దాన్ని సొంతదిగా భావిస్తారని, రాజ్యాంగానికి, ప్రజలకు మధ్య అనుసంధానం ఉండాలని విప్లవ రచయితల సంఘం నాయకుడు సీఎస్ఆర్‌కే ప్రసాద్ అభిప్రాయపడ్డారు. పట్టణానికి చెందిన సాహితీ, సాంస్కృతిక వేదిక 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో 'భారత రాజ్యాంగం: మంచి చెడు' అనే అంశంపై చర్చావేదికను నిర్వహించారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఏర్పాటైన ఆ చర్చాగోష్టికి సమన్వయకర్తగా జీఎస్ నాగేశ్వరరావు వ్యవహరించారు. సీఎస్ఆర్‌కే ప్రసాద్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, 75 ఏళ్ల సుదీర్ఘకాలంలో రాజ్యాంగం ప్రకారంలో పేర్కొన్న లక్ష్యాలను ఏమేరకు సాధించాం, ఆచరణలో ఎంతవరకు విజయవంతమైందీ చర్చ జరగాలన్నారు. రాజ్యాంగ ప్రవేశికలో పేర్కొన్న సామ్యవాదం, లౌకికవాదం గురించి స్పష్టత లేదన్నారు. రాజ్యాంగంపై చర్చ ఆచరణవైపు నుండి జరగాలనీ, న్యాయమూర్తులు కూడా భిన్నమైన వ్యాఖ్యలు చేస్తున్నారని, పాలకవర్గాలు అస్పష్టతను కొనసాగిస్తున్నాయని వివరించారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ రాజనీతిశాస్త్ర ఆచార్యుడు వి.అంజిరెడ్డి మాట్లాడుతూ చాలా దేశాలకు భిన్నంగా, భారతదేశం స్వాతంత్ర్యం సమకూరిన వెంటనే ఆధునిక రాజ్యాంగాన్ని రూపొందించుకుని ప్రజాస్వామ్య పాలనకు దిగటమనే సాహసానికి పూనుకుందని చెప్పారు. భారత్‌లో ఇది ఎక్కువ కాలం నిలిచేది కాదని భావించిన పాశ్చాత్యులు ఆశ్చర్యపోతున్నారని అన్నారు. ప్రజాస్వామ్య భావనలో చాలా పరిమిత హక్కులను గ్రహింపగలగటం వల్లనే ప్రజాస్వామ్యం కొనసాగుతోందని చెప్పారు. రాజ్యాంగం అనే పదం సరైంది కాదనీ, రాజ్యశాసనంగా సాధ్యమైనంత తర్వగా మార్చుకోవాలన్నారు. సమన్వయకర్త జీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ, రాజ్యాంగంలోని వయోజనవిద్యతో పేదరికం గణనీయంగా తగ్గిందనీ, ఓటు హక్కుతో రాజకీయ సమానత్వం ప్రసాదించిందనీ, సామాజిక సమానత్వంలోనూ ఒక అడుగు ముందుకు పడిందన్నారు. సంస్థ కన్వీనర్ కేవీ రాఘవరెడ్డి స్వాగతం పలికిన సభలో జుగాష్‌విలి, ఉమారాజశేఖర్, పిల్లి వాసు, కనపర్తి బెన్‌హర్, వై.అశోక్‌కుమార్, లలితానంద ప్రసాద్, దేవిశెట్టి కృష్ణారావు, జాలాది మోజెస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎస్ఆర్‌కే ప్రసాద్

ఐసీయూ విభాగాన్ని వీడని గ్రహణం

- ఆరు సంవత్సరాలైనా పూర్తికాని సిబ్బంది నియామకం
- పోస్టులు రద్దు చేసిన ప్రభుత్వం
- నేటికీ తెనాలి చేరని వెంటిలేటర్‌లు
- ఆక్సిజన్‌లతో సరిపెడుతున్న అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఇంటెన్సివ్ కేర్ యూనిట్(ఐసీయు) విభాగానికి పట్టిన గ్రహణం వీడటం లేదు. దీనిని ఏర్పాటు చేసి ఆరు సంవత్సరాలు దాటిన నేటికీ దానిలో వైద్యులు, సిబ్బంది నియామకం జరగలేదు. ఇదిలా ఉంటే దీనికోసం మంజూరు చేసిన వైద్యులు, సిబ్బంది పోస్టులను ప్రభుత్వం రద్దు చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది. చేసేది లేక జిల్లా వైద్యశాలలోని ఫిజీషియన్‌లే దీనిలో చేరిన రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో రూ.22 లక్షలతో 2018లో ఐసీయూను ఏర్పాటు చేశారు. దానిని రెండు విభాగాలుగా విభజించి ఐసీయూ–20, హెచ్‌డీయూ–8 బెడ్‌లను ఏర్పాటు చేశారు. హెచ్‌డీయూ బెడ్‌లకు వెంటిలేటర్, ఆక్సిజన్ అందించే ఏర్పాటు చేశారు. మిగిలిన 20 బెడ్‌లకు కేవలం ఆక్సిజన్ అందించే సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

పోస్టులను రద్దు చేసిన ప్రభుత్వం

తెనాలి జిల్లా వైద్యశాలకు ఐసీయూ విభాగంలో సేవలు అందించేందుకు నాలుగు ఫిజీషియన్ వైద్యుల పోస్టులు, ఎనస్తీషియా–4, టెక్నీషియన్‌లు, స్టాఫ్ నర్సులు కలిపి–22 పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ సమయంలో ఒక ఎనస్తీషియా వైద్యురాలిని తెనాలి కూడా పంపారు. ఆమె వచ్చి ఒక్కరే 24 గంటలు సేవలందించాలంటే కష్టమని చెప్పి వెనక్కి వెళ్లిపోయారు. స్టాఫ్ నర్సులను కొత్తవారిని నియమించే లోపు ఉన్నవారిలో కొందరిని ఐసీయూ సేవలకు ఉపయోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచించారు. దీంతో ముగ్గురు స్టాఫ్ నర్సులను గుంటూరులోని జీజీహెచ్‌కి శిక్షణ నిమిత్తం గతంలో పంపారు. ఆ తర్వాత ఏమి జరిగిందో ఏమో ఆ ఊసే లేకుండా పోయింది. దీంతో వైద్యులు, సిబ్బంది నియామకాలు జరగక జిల్లా వైద్యశాలలో పనిచేసే వారితో అక్కడ సేవలు అందిస్తు వస్తున్నారు. ఇదిఇలా ప్రభుత్వం ఐసీయూకు మంజూరు చేసిన పోస్టులను రద్దు చేస్తు ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇప్పటి వరకు ఉన్న ఆశలు కూడా అడియాశలు అయినట్లు అయ్యింది.

అందుబాటులో ఉన్న నామమాత్రపు వెంటిలేటర్

ఐసీయూ విభాగంలో హెచ్‌డీయూ బెడ్‌లు–8 ఏర్పాటు చేశారు. వాటికి వెంటిలేటర్ సదుపాయాన్ని కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ముక్కు ద్వారా అందించే వెంటిలేటర్‌లను తెనాలి పంపారు. వాటిని ఏర్పాటు చేసి సేవలు అందిస్తుండగా కోవిడ్ ఉధృతమైంది. ఆ సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా వైద్యశాలలో ఆక్సిజన్ ప్లాంట్‌లను ఏర్పాటు చేసి వైద్యశాలలోని అన్ని బెడ్‌లకు ఆక్సిజన్ సదుపాయాన్ని కల్పించింది. అలాగే సుమారు 300 వెంటిలేటర్‌లను గత ప్రభుత్వం తెనాలి పంపింది. కోవిడ్ ఉధృతి తగ్గటంతో అధికారులు వెంటిలేటర్‌లను తొలగించి గదిలో భద్రపరిచారు. ప్రస్తుతం ముక్కుల ద్వారా అందించే వెంటిలేటర్ సదుపాయం మాత్రమే ఉంది. గొంతులో వేసే వెటిలేటర్ సదుపాయం అందుబాటులో లేదు. ఇప్పటికైన పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఐసీయు విభాగానికి నూతన పోస్టులు మంజూరు చేయటంతో పాటు వెంటిలేటర్ సదుపాయాన్ని ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ఐసీయూ విభాగం

పూర్వ విద్యార్థుల వనసమారాధన

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు జెడ్పీ హైస్కూలు 1987–88 బ్యాచ్ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధనను శనివారం గ్రామంలోని అరటి తోటల్లో నిర్వహించారు. పూర్వ విద్యార్థులందరూ చిన్నారి స్నేహం పేరిట గ్రూప్ ఏర్పాటు చేసుకుని వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి హైదరాబాద్ జీఎస్టీ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ యడ్ల శ్రీలీల ముఖ్య అతిధిగా హాజరయ్యారు. తన్నీరు సుబ్బారావు, కరేటి శ్రీనివాసరావు, తన్నీరు పద్మజ, కె. శైలజ, కనిగినీడి సీతారామాంజనేయులు, అంకట రమేష్‌బాబు, తాళ్ల శ్రీహరి, షేక్ ఖలీల్, ఏపూరి శ్రావణ్ కుమార్, అంబటి కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.